క్లుప్తంగా

ఆగస్టు 4న చౌడేశ్వరి తిరునాల



చౌడేశ్వరిదేవి మూలవిరాట్

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేట గాంద్లపాళెంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి తిరునాల ఆగస్టు 4న జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. నేతన్నల ఇంటి ఆడబిడ్డ, నేతన్నల కులదేవతగా పేరొందిన చౌడేశ్వరీదేవి అమ్మవారి తిరునాల సందర్భంగా కమలాపురం మండలం పెద్దపుత్త గ్రామానికి చెందిన 36 మందితో ఈనెల 4న ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, దేవీ ఖడ్గ మాల, కుంకుమార్చన, అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేస్తామన్నారు. ఆదివారం రాత్రి 7 గంటల నుంచి చౌడేశ్వరీదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహంను మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు.

ధ్వజస్తంభ నిర్మాణానికి ఏర్పాట్లు



దేవస్థానంలో చర్చిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని భుజంగేశ్వర దేవస్థానంలో ధ్వజ స్తంభ ఏర్పాటుపై మంగళవారం అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ ఆలయంలో గ్రామస్తులతో, మాజీ చైర్మన్‌లు, సభ్యులతో చర్చించారు. రాబోయే కార్తీక మాసంలోపు అన్ని సమస్యలు పరిష్కరించి ధ్వజస్తంభ ప్రతిష్ఠకు చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే భుజంగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూముల ఆక్రమణలపై మండల రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో చర్చించారు. దేవస్థాన భూములు ఎవరైనా ఆక్రమించుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్‌లు, ఆలయ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఈఓ కొండారెడ్డి, సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తిథి భోజనం



విద్యార్థులకు తిథి భోజనం వడ్డిస్తున్న దృశ్యం

గాలివీడు : నూలివీడు గ్రామంలోని జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మంగళవారం వంటమనిషి నసీబ్‌జాన్ తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు చికెన్ బిర్యానీ వడ్డించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారులు పి.నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అతిథి భోజనం ఏర్పాటు చేసిన నసీబ్‌జాన్‌కు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌ఏ మున్వర్‌బాషా, ఎంఆర్‌సీలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటితో దుర్వాసన



కమ్మపాలెం ప్రధాన రహదారిపై నిలిచిన మురుగునీరు

సిద్దవటం : మండలంలోని కమ్మపాలెం గ్రామ ప్రధాన రహదారిలో వర్షంతోపాటు మురుగు నీరు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. రహదారి పక్కనే కొంతమంది బర్రెలు అక్కడే ఉంచడం వల్ల వర్షం పడితే గంజీరం, మురుగు నీరు రహదారిపైకి వచ్చి నిల్వ ఉండటం వల్ల ఎక్కడ విషజ్వరాలు వస్తాయోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. రహదారిలో నీరు నిల్వ లేకుండా శాశ్విత పరిష్కారం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మురుగు నీరు ఉండటం వల్ల రాత్రి వేళల్లో దోమల బెడదతో అల్లాడిపోతున్నామని స్థానికులు తెలిపారు. ఈ విషయమై గ్రామ సచివాలయ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డిని వివరణ కోరగా గ్రామ సర్పంచ్ అధ్యక్షతన శాశ్విత పరిష్కారం కోసం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని తెలియజేశారు.

నూతన నియామకం



సాయి, స్టూడెంట్స్ సెల్ జిల్లా అధ్యక్షులు

రాయచోటి టౌన్ : హ్యూమన్ రైట్స్ స్టూడెంట్స్ సెల్ జిల్లా అధ్యక్షులుగా శెట్టిపల్లె సాయి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం స్టూడెంట్స్ సెల్ వింగ్ వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు డాక్టర్ హెచ్ ఎండీ ముజాయిద్ ఒక ప్రకటన విడుదల చేసినట్టు సాయి పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం సాగిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు

- గ్రామాల్లో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- పెరిగిన దోమల ఉధృతి
- రోగాలబారిన పడుతున్న ప్రజలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



శాంతినగర్ సమీపంలో నిల్వ ఉన్న మురికినీరు, వ్యర్థ పదార్థాలు



కే బోయినపల్లి వద్ద జాతీయరహదారిపై పడేసిన చెత్తాచెదారాలు

రాజంపేట రూరల్ : ఇటీవల కాలంలో వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులు, ముసురు పట్టి ఉండటం, ఎక్కడికక్కడ మురుగుమయంతో దోమల ఉధృతి పెరిగిపోతూ ఉందనేది ప్రజల మనోగతం. నియోజకవర్గంలోని ఆరు మండలాలలో ఉన్న గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అంతంత మాత్రమే అనేది బహిరంగ రహస్యం. కొన్ని ప్రాంతాలలో, పట్టణాలలో ఉన్నప్పటికీ అది అస్తవ్యస్తంగా మారిందనేది జగమెరిగిన సత్యం. పట్టణం, గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి, ఎక్కడకక్కడ మురుగునీరు, వర్షం వచ్చినపుడు వర్షపునీరు నిల్వ ఉండిపోయి దోమలు, క్రిములు వృద్ధి చెందుతున్నాయి. దీంతోపాటు తాగునీరు కలుషితం అవుతోంది. వాతావరణంలో వచ్చే మార్పులు అనేక ప్రాంతాల్లోని ఇంటి పరిసరాల్లో నిలిచే మురుగు, వర్షపునీటిలో వృద్ధి చెందే దోమలతో మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి వ్యాధులు కలుషితమైన తాగునీరు, కలుషిత ఆహారంతో డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో సీజన్‌లతో సంబంధం లేకుండా జనం ఆసుపత్రి పాలవుతున్నారు. కాలువలలో మురుగు ముందుకు పారకపోవడం, చెత్త వ్యర్థాలు పేరుకుపోయి ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఏ డ్రైనేజీలో చూసినా దోమల లార్వా కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. దీంతో దోమల ఉధృతికి అడ్డూ అదుపులేకుండా పోయింది. నియోజకవర్గంలోని రాజంపేట, సిద్దవటం, ఒంటిమిట్ట, నందలూరు, వీరబల్లి, సుండుపల్లె మండలాల్లోని పలుగ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు, డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనకు, చెత్త తొలగింపునకు తద్వారా దోమల నివారణకు చర్యలు తీసుకోవడంలో ఆయా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదే క్రమంలో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ రకాల జ్వరాలతో గ్రామీణ వైద్యుల వద్ద ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరిగిపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

మలేరియా జ్వరం..

మలేరియా వ్యాధి ప్లాస్మోడియం అనే పరాన్నజీవి ద్వారా ఇన్‌ఫెక్ట్ అయిన ఆడ అనాఫిలీస్ అనే దోమకుట్టడం ద్వారా వస్తుంది. ఈ దోమ మంచినీరు, మురుగునీటి నిల్వల్లో పెరిగి మలేరియా వ్యాధిని వ్యాప్తి చేస్తాయి. ఈ దోమ వాలినప్పుడు ఏటవాలుగా ఉంటుంది. ఇది కుట్టడం వలన 7 నుంచి 10 రోజులలోపల చలి, వణుకు, ఒళ్లునొప్పులతో కూడిన విపరీతమైన జ్వరం రోజుమార్చి రోజు వస్తుంది. ఆ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్యుని సంప్రదించి రక్తపరీక్షలు చేయించుకొని తగిన చికిత్సపొందాలి.

డెంగీ వ్యాధి..

దోమకాటు ద్వారా ఆకస్మికంగా జ్వరంతో వివిధ నొప్పులు ఉంటే అది డెంగీ కావచ్చు. ఇది ఆడ ఈడీస్ దోమ ద్వారా వ్యాపిస్తుంది. ఈ దోమపై తెల్లని సారలు ఉంటాయి. దీనిని టైగర్ దోమ అని కూడా అంటారు. ఇవి ఇంటిలోపల ఆవరణలోనూ ఉంటాయి. పగటిపూట ఎక్కువగా కుడతాయి. ఈ దోమ మంచినీటిలోనే గుడ్లు పెడుతుంది. ఈ దోమకాటు తరువాత 3 నుంచి 14 రోజుల్లో డెంగీ రావచ్చు. ఆ వ్యాధి వలన ఆకస్మికంగా జ్వరంతో పాటు కీళ్లు, కండరాలు, కంటినొప్పులు, వాంతులతో డెంగీ మొదలవుతుంది. కొంతమందికి శరీరంపై ఎర్రటిదద్దుర్లు, చిగుర్ల నుంచి రక్తస్రావం అవుతుంది. ఇందుకు అత్యవసరమైన చికిత్సతోపాటు కొందరికి ప్లేట్‌లెట్స్ ఎక్కించవలసి ఉంటుంది. గర్భిణులు, చిన్నపిల్లలు, ఇతర దీర్ఘకాల వ్యాధులు ఉన్నవారికి ప్రమాదం ఎక్కువ. త్వరితగతిన చికిత్స చేయించుకోవాలి.

చికిన్ గున్యా వ్యాధి..

చికిన్ గున్యా వైరస్‌తో ఇన్‌ఫెక్ట్ అయిన ఈడీస్ దోమకుట్టడం ద్వారా వ్యాధి వస్తుంది. ఈ దోమకుట్టిన 3 నుంచి 12 రోజులు లోపుల జ్వరం వస్తుంది. తలనొప్పి, వాంతులు, వికారంతో హఠాత్తుగా వచ్చే జ్వరం ఈ వ్యాధి ముఖ్య లక్షణం. శరీరంలో అన్ని కీళ్లను బాధిస్తుంది. ముఖ్యంగా చేతివేళ్లు, కీళ్లనొప్పుల వల్ల నిలబడలేని పరిస్థితి ఉంటుంది. జ్వరం తగ్గినా ఈ నొప్పులు చాలా కాలం ఉంటాయి. ఈ లక్షణాలు కనబడిన వెంటనే దగ్గరలోని ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకొని చికిత్సపొందాలి.

డయేరియా (అతిసారా), టైఫాయిడ్ వ్యాధులు..

కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వలన డయేరియా, టైఫాయిడ్ వ్యాధులు సంక్రమిస్తాయి. రోజుకు మూడుకంటే ఎక్కువసార్లు నీళల విరేచనాలు అయితే దాన్ని అతిసార వ్యాధి అంటారు. అది బ్యాక్టీరియా వల్లగానీ, వైరస్ వల్లగానీ రావచ్చు. ఒకరి నుంచి మరొకరికి పారిశుద్ధ్య లోపం వలన వస్తుంది. దీంతో వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, దాహం, నోరు ఎండిపోవడం, మూత్రవిసర్జన తగ్గిపోవడం ఈ వ్యాధి లక్షణాలు. అలాగే క్యూలెక్స్ దోమ వలన ఫైలేరియా జపనీస్ వంటి వ్యాధులు సంక్రమిస్తాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి



ప్రధాన పట్టణాలతోపాటు గ్రామాలలో వర్షపునీరు, డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడం లేదు. అందువలన వీధులు, రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఎప్పటికప్పుడు మురుగు, చెత్త, వ్యర్థాలను తొలగిస్తూ పరిశుభ్రంగా ఉండేలా పట్టణ, గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. తద్వారా దోమలను అరికట్టి వ్యాధులు ప్రబలకుండా చూడాలి.

– మన్నూరు నరసింహారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు, రాజంపేట

పరిశుభ్రత పాటించాలి



గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతోపాటు ఈ కాలం, ఆ కాలం అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటించాలి. ముఖ్యంగా జ్వరాలు, వైరస్, బ్యాక్టీరియా లేదా పరాన్న జీవులు వల్ల వస్తాయి. జ్వరం చిన్నదైనా, పెద్దదైనా వెంటనే వైద్యుని సంప్రదించాలి. వారి సూచనలు మేరకు మందులు వాడాలి. జ్వరం తగ్గకపోతే వైద్యుల పర్యవేక్షణలో రక్తపరీక్షలు చేయించుకొని వ్యాధికి తగిన చికిత్సలు చేయించుకోవాలి.

– డాక్టర్ సోమిసేని అశ్వినీచంద్ర, వైద్యాధికారి, ఆకేపాడు పీహెచ్‌సీ

పరామర్శ



గంగమ్మను పరామర్శిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని దేశెట్టిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ప్రసాద్ తల్లి గంగమ్మ అనారోగ్యంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అక్కడికి వెళ్లి ఆమెను పరామర్శించి ఎంపీటీసీ కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కార్యకర్తలకు అండగా ఉండి ఆదుకుంటామన్నారు.

ఊరిస్తున్న మబ్బులు..

పెనగలూరు : మండలంలో మబ్బులు ఊరిస్తున్నాయే తప్పా వర్షం మాత్రం కురవడం లేదు. జూన్ మాసం నుంచి కనీసం వాగు, వంకలలో నీరు లేకపోవడంతో రైతులు నిస్సాహయ స్థితిలో ఉన్నారు. బోర్లలో ఒక ఇంచి నీరు కూడా పెరగడం లేదు. రోజురోజుకు వ్యవసాయ బోర్లలో నీరు తగ్గుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అప్పుడప్పుడు అరకొరగా వర్షం కురిసినా లాభం లేకుండా పోయిందన్నారు. వరుణదేవుడు కరుణించకపోతే ఈ ఏడాది కరువు తప్పదని రైతులు దిగాలు చెందుతున్నారు.

చర్మవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

లక్కిరెడ్డిపల్లె : చర్మవ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బోదనపు సిద్దయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో బాలుర విద్యార్థులకు చర్మవ్యాధులు, కుష్టు (లెప్రసీ) వ్యాధుల పట్ల అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ సిద్దయ్య మాట్లాడుతూ చర్మంపై తెల్లటి పొడలు ఉన్నా, వాటిని నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రికి వెళ్లి పరీక్షించుకోవాలన్నారు. తెల్లటి పొడలపై స్పర్శ లేకుంటే వెంటనే చర్మవ్యాధి వైద్యులను సంప్రదించాలన్నారు. కుష్టు వ్యాధిపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌పీ కుమారి, ఏఎన్‌ఎం ఉమామహేశ్వరి, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అసమానతల వల్లే మహిళల అక్రమరవాణా



మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మీదేవమ్మ

గాలివీడు : మహిళల అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాజు, రీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి పిల్లి నాగరాజు, సర్పంచ్ లక్ష్మీదేవమ్మలు హాజరయ్యారు. మాట్లాడుతూ ప్రపంచంలో మహిళలు, బాలికల అక్రమ రవాణాకు గురవుతున్నారంటే ఆర్థిక అసమానతలే ముఖ్యకారణమన్నారు. అంతేగాక బలవంతపు శ్రమ దోపిడీ, లైంగిక దాడులు, గృహ బానిసత్వం, పేదరికంతో ఇబ్బందులు పడుతున్న బలహీనమైన మహిళలు, బాలికలను లక్ష్యంగా చేసుకుని ఈ అక్రమ రవాణా సాగుతోందన్నారు. ఇంకా పిల్లలను లక్ష్యంగా చేసుకొని బిక్షాటన, అవయాలు దొంగలించడం వంటి చర్యలు పరిపాటిగా మారిందన్నారు. ఈ చర్యలు పట్ల మహిళలు, బాలికలు, చిన్న పిల్లలు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న పిల్లలకు వివాహం చేయడం, బాలకార్మికులుగా మార్చడం చట్ట విరుద్ధమని ఐసీడీఎస్ సిబ్బంది గుర్తుకు చేశారు. సమావేశంలో రీడ్స్‌సంస్థ అధ్యక్షులు శ్రీనివాసులు, సీడీపీఓ పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి



చిట్వేలి: ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

చిట్వేలి : రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ యువ నాయకుడు సాయివికాస్‌రెడ్డిలు వైద్యులకు సూచించారు. మంగళవారం చిట్వేలి ప్రభుత్వ వైద్యశాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పారిశుద్ధ్యాన్ని పాటిస్తూ రోగులపట్ల, వైద్యం పట్ల అశ్రద్ధ వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించి ఉన్నతాధికారులతో చర్చించారు. త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కాకర్ల నాగార్జున, గుత్తి నరసింహ, ఆకేపాటి వెంకటరెడ్డి, సత్యనారాయణ, మాదాసు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించండి

పుల్లంపేట : రైల్వేకోడూరు నియోజకవర్గ శాసనసభ్యులు అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డిలను మంగళవారం నియోజకవర్గ విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షులు మల్లు సుబ్బనరసారెడ్డి, దివ్యాంగుల సంఘం సభ్యులు కలిసి దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం వారికి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షులు ధనుంజయ, వాహిద్, తిరుపాల్, అబ్దుల్ ఖాదర్, నరసింహులు, వెంకట ప్రసాద్, తిరుమలరెడ్డి, చిరంజీవి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి మోటారు ఏర్పాటు

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని అయ్యలరాజుపల్లె గ్రామంలో తాగునీటి మోటారు చెడిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కొత్త మోటారును ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



పొలంబడిలో పాల్గొన్న అధికారులు, రైతులు

గాలివీడు : వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ అధికారి మురళీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నూలివీడు గ్రామంలో హార్టికల్చర్ అసిస్టెంట్ రాణాప్రతాప్ ఆధ్వర్యంలో జీఏపీ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేరుశనగ పంట మొదటి నుంచి పలు విధాల తెగుళ్లు ఆశిస్తాయన్నారు. విత్తనశుద్ధి నుంచి పంట చివరి దశ వరకు ఆయా తెగుళ్ల నివారణకు తగిన చర్యలు తీసుకోకుంటే నాణ్యత లేకపోవడమే కాక, దిగుబడులు గణనీయంగా పడిపోయి రైతులు నష్టపోతారన్నారు.

భక్త సంజీవరాయుడికి పూజలు



ప్రత్యేక అలంకారంలో సంజీవరాయస్వామి

ఒంటిమిట్ట : ఆంధ్రాభద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయం ఎదురుగా ఉన్న భక్త సంజీవరాయ ఆలయంలో స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేకంగా పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు తొడిగి, బంగారు ఆభరణాలు వేసి, సుగంధ పరిమళమైన గజమాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారికి ఆకు పూజతో పాటు విశేష పూజ కార్యక్రమాలు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పూజారులు అందజేశారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

రామాపురం : ఈఓపీఆర్డీ ఉషారాణి ఆదేశాల మేరకు మండలంలోని సరస్వతిపల్లి, కుమ్మరపల్లి పంచాయతీలో సర్పంచులు మునీర్‌బాషా, ముక్కోటిభారతి, పంచాయతీ సెక్రటరీ సూరం సంజీవరెడ్డి, బి.సాయి దీపక్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు మంగళవారం నిర్వహించారు. గ్రామాల్లోని వీధుల్లో చెత్తాచెదారం, ఊరు ఆనుకొని ఉన్న దిబ్బలు, కంపచెట్లు తొలగించి బ్లీచింగ్, సున్నంను పిచికారీ చేశారు. జేసీబీ సహాయంతో కంపచెట్లను తొలగించారు. కుమ్మరపల్లెలో రక్షిత మంచి నీటి మినీ ట్యాంక్‌ను కూలీల ద్వారా శుభ్రపరిచారు.

వాహనాల తనిఖీ

సిద్దవటం : అట్లూరు, సిద్దవటం గ్రామ సమీపంలో ఉన్న ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద మంగళవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశామని రేంజర్ కళావతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ అటవీ సంపద తరలిపోకుండా, వన్యప్రాణుల వేటను అరికట్టడానికి వాహనాల తనిఖీ చేస్తున్నామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వన్యప్రాణుల గురించి ఏదైనా సమాచారం తెలిస్తే తెలియజేయాలని చెప్పారు. అలాగే కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తున్నా సమాచారం ఇవ్వాలన్నారు.

ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేస్తారు.. జాగ్రత్త



మాట్లాడుతున్న న్యాయమూర్తి డాక్టర్ ప్రసూన

రాయచోటి టౌన్ : మీకు ఉద్యోగం ఇప్పిస్తామని మాయ మాటలు చెప్పేవారు ఎక్కువ అయ్యారు, వారితో తస్మాత్ జాగ్రత్త అని సీనియర్ న్యాయమూర్తి డాక్టర్ ఈ.ప్రసూన విద్యార్థులకు సూచించారు. మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఉర్దూ డిగ్రీ కళాశాలలో హ్యూమన్ యాంటీ లీగల్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, యువత, విద్యార్థినులను టార్గెట్ చేసుకొని ఉద్యోగాలు ఇప్పిస్తామని, విదేశాలలో సెటిల్ చేయిస్తామని మోసగాళ్లు మోసం చేస్తున్నారని చెప్పారు. అలాగే ఇప్పుడు చాలా చోట్ల సినిమా రంగంలో అవకాశాలు కల్పిస్తామని మోసం చేసే వారి సంఖ్య ఎక్కువ అయ్యిందన్నారు. అలాగే సెల్ ఫోన్‌లో తెలియని వారితో చాటింగ్ చేయడం వారితో స్నేహం చేయడం, తరువాత ప్రేమ అంటూ చాటింగ్ చేయడం వంటివి చేసి చివరికి పెళ్లి చేసుకొంటమని కొందరు, పెళ్లి చేసుకొని మోసం చేసి పారిపోవడం వంటివి చేస్తుంటారని అన్నారు. విద్యార్థులు చాలా అవగాహన కలిగి తెలిగితో ప్రవర్తిస్తుండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.వెంటరమణ, ఎం.నాగేశ్వరావు, బి.శ్రీనివాసనాయక్‌లు పాల్గొన్నారు.

ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

వీరబల్లి : మండలంలోని మట్లి గ్రామ పంచాయతీలో యుద్ధప్రాతిపదికన ఆ గ్రామ సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి, ఎంపీడీఓ రామచంద్రారెడ్డిల ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మట్లి ఎల్లంపల్లిలో తోగటపల్లి, పెద్దూరు కస్పా, గంగాపురం, మట్లి వడ్డిపల్లి తదితర గ్రామాలలో పారిశుధ్య చర్యలు చేపట్టడమే కాకుండా గ్రామంలోకి మురికి కాలువలను మురికి కుంటలను శుభ్రం చేశారు.

తమ ఇళ్ల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, గ్రీన్ అంబాసిడర్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యేశ్వరుడి కల్యాణం

- భక్తిశ్రద్ధలతో ఆడికృతిక పూజలు
- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు



పుల్లంపేట: కల్యాణ వేడుకకు హాజరైన భక్తులు



పుల్లంపేట: శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పుల్లంపేట : మండలంలో ఆడికృతిక సందర్భంగా సుబ్రమణ్య స్వామి ఆలయాల్లో మంగళవారం విశేష పూజలు జరిగాయి. మండలంలోని శ్రీ పర్వతవర్ధిని శాంతిలింగేశ్వర స్వామి ఆలయంలో, రెడ్డిపల్లి కట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి కల్యాణ క్రతువు వేదపండితులు చాపాటి ఈశ్వర్ రావు, శివశర్మల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అంతకుముందు స్వామి వారి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకాలు జరిపారు. కల్యాణంలో పాల్గొన్న అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చిట్వేలిలో..

చిట్వేలి : ఆడికృతిక సందర్భంగా వేల్మురుగన్ నామంతో ఆలయాలు మార్మోగాయి. మంగళవారం స్థానిక శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పవన్ శర్మ, సురేంద్ర శర్మల ఆధ్వర్యంలో ఆడి కృతికను వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఏకవారిక ఏకవార రుద్రపటన, పంచామృతాభిషేకం, సకల ద్రవ్యాభిషేకం, మహా నైవేద్యం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సుబ్రమణ్య స్వామికి అభిషేకం

నందలూరు : నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కనే వెలసిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం ఆడి కృతిక సందర్భంగా సుబ్రమణ్యం స్వామికి అభిషేకం, అలంకరణ వైభవంగా జరిగింది. ఆలయ పూజారి నరసా రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు భక్తి శ్రద్ధలతో అభిషేక కార్యక్రమంలో పాల్గొని వారి మొక్కులు తీర్చుకున్నారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని శివాలయంలో కొలువైన సుబ్రమణ్యస్వామి ఆలయంలో, బొజ్జవారిపల్లి సుబ్రమణ్యస్వామి ఆలయాలలో మంగళవారం ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక అభిషేకాలు, హారతులు నిర్వహించనున్నారు. మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకారాలు గావించారు. భక్తులకు అన్నదానాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



చిట్వేలి: పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



రైల్వేకోడూరు అర్బన్ : పూజలను తిలకిస్తున్న దృశ్యం



నందలూరు: ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు